7. విశ్వనాథుని గొప్ప – విశ్రాంతిలోను ప్ర– వేశము నాకు నొసంగుగా = విశ్వాస ఫలము లివి – నీ శాశ్వత రక్ష – ణాశ్రయం బిదియె విడకు ॥విశ్వా॥

– మురారి దావీదు

## 390 విశ్వాసమువలని విశ్రాంతి

రా – మారువ (చాయ : మంగళంబని పాడరే) తా–అట

సందియము వీడవే – నా మనసా యా – నందమున గూడవే = సందియము లింకేల నిను సుఖ– మొందఁ జేసెడు క్రీస్తు రక్తపు – బిందువులు శుభవార్తవాక్యము – లందుఁ గని తెలి వొంది బ్రతుకుచు ॥సందియము॥

1. చింత లిఁక మానుము – లోకులు దెల్పు – భ్రాంతుల్ బడఁ బోకుము =ఎంత వింత దురంత పాపము – లంతటను దన రక్తమున గో – రంత లేకయె దుడుచు నని సి – ద్ధాంత మగు ప్రభు వాక్యమును విని ॥సందియము॥

2. పాపములు వీడుము – నీ విఁకఁ బశ్చా – త్తాపమున గూడుము = ఏపు మీరిన యోర్పుతో నొక – పాపి కైన లయంబుఁ గోరక – పాపులందఱు దిరిగి వచ్చెడు – కోపుఁ గోరెడు కర్త దరిఁ జని ॥సందియము॥

3. నేరముల నెంచుకో – యేసుని కరుణా – సారముఁ దలంచుకో = భార ముల్ మోయుచు శ్రమన్ బడు – వార లందఱు నమ్మి నా దరిఁ జేర విశ్రమ మిత్తునను ప్రభు – సార వాక్కెలు చక్కఁగా విని ॥సందియము॥

4. నిమ్మళము నొందుము – రక్షకుని పలుకు – నమ్మికొని యుండుము = ఇమ్మహిని బాపులకు నై ప – క్షమ్ము జేసి పరాత్పరుని సము – ఖమ్మునందుఁ చిత్తమ్ముగాఁ – కాయమ్ము బలియిడు నీప్రభునిఁ గని ॥సందియము॥

5. ప్రేమ దయా శాంతముల్ – కర్తకు భూషా – స్తోమము లవంతముల్ నీ మొఱ ల్విని యేసునాథ – స్వామి తన రక్తమున బాపముఁ దోమి ని న్నకళంకుఁ జేయును నీ మదిన్ దగ నమ్మికొన యిఁక ॥సందియము॥

– పురుషోత్తము చౌదరి



## 391 విశ్వాస విజయము

రా – కమాను (చాయ: కొనియాడదరమె) తా–అట

విశ్వాసమే విజయము – విను ప్రియుఁడా య – విశ్వాస మపజయము = విశ్వాసాయుతమైన – విసుకని సుకార్యములే – విశ్వాసవంతునికి – విజయ మొసంగును నిజము ॥విశ్వాసమే॥

1. భక్తుఁ డందు వలననే – బ్రతుకును మరియు – శక్తినొంది నిల్చును = యుక్తముగ వర్తించి – యుర్విని జయించి – ముక్తినొందున టంచు – రక్తిగాఁ బాడుదును ॥విశ్వాసమే॥

2. మంచి పేరు నొందును – సాతాను నెది– రించి విజయ మొందును = మించిన బాధ ల్స – హించి జయించును – నంచిత మరణము – నానంద ముగఁగాంచు ॥విశ్వాసమే॥

3. ప్రవిమల మొందెదము – పాపమునుండి – పరిహరింపఁబడుదుము = అవి రతమును మనము – నాశ్చర్యముగ ఘనము – భువియందున్ దివియందున్ – బుధులతో నొందుదుము ॥విశ్వాసమే॥

4. నీతిమంతుల మౌదుము – నిశ్చయము ప్ర– ఖ్యాతి బోధను నేర్తుము = ఆ తండ్రి దత్తముల – నన్ని యార్జించుచు – యాతని సుభద్రములో – ననయ ముందుము నిజము ॥విశ్వాసమే॥

5. పరిపూర్ణ విశ్వాసమే – క్రియలతో నున్న – మరి మంచి విశ్వాసమే = ధరయందున్ బరమందున్ – ధన్యాత్మునిగఁ జేయున్ – సరగు నద్దానినే – సంపాదించుము ప్రియుఁడా ॥విశ్వాసమే॥

– మురారి దావీదు

## 392 *My faith look up to Thee*

1. ఓ దేవ రక్షకా
నే విశ్వాసంబుతో
నిన్ జూతును
నా మొఱ్ఱాలించుము
నా పాప మార్పుము
నన్నింక నీ దరిన్
సదా యుంచు.